క్లుప్తంగా

ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని ఆత్మకూర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా సేవలందించి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవో శంకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని తెలిపారు. ఈ వృత్తిలో పనిచేయడం చాలా బాధ్యతగా భావించాలని సూచించారు. అనంతరం పాఠశాలకు నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రామకోటయ్య, ఉపాధ్యాయులు అంతయ్య, ఆశలత, పీఈటీ రాజశేఖర్, నాగేశ్వర్, అనిత, ఆదర్శ కమిటీ చైర్మన్ అమృతమ్మ, సీఆర్పీలు పాల్గొన్నారు.

తల్లి అదృశ్యంపై ఫిర్యాదు



గోరిబి

పటాన్‌చెరు టౌన్: మానసిక స్థితి సరిగాలేని తల్లి అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీరంగూడకు చెందిన వృద్ధురాలు గోరిబికి గత ఆరు నెలల నుంచి మానసిక స్థితి సరిగా లేకపోవడంతో ఇబ్బంది పడుతోంది. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తల్లి అదృశ్యంపై కుమారుడు ఎండీ దస్తగిరి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ అందజేస్తున్న వినయ్‌గౌడ్, ఉపాధ్యాయులు

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని పోతులబోగుడా మోడల్ పాఠశాల విద్యార్థులకు బుధవారం యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినయ్‌గౌడ్ ఉచితంగా నోట్‌బుక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే ప్రతిఒక్కరూ ఉన్నత స్థాయికి చేరుకోగలుగుతారన్నారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. ఉచితంగా నోట్‌బుక్స్‌ను అందజేయడం పట్ల పాఠశాల యాజమాన్యం వినయ్‌గౌడ్‌ను అభినందించింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్లిక, ఉపాధ్యాయులు శివరాంరెడ్డి, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లేశం, ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు ఖాజా, ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రోజారాణి

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి అన్నారు. మున్సిపల్ పరిధిలో ఉన్న బీరప్పబస్తీలో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని కాలనీలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు దశలవారీగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి చేస్తున్నామని వివరించారు.

అంబులెన్స్ సౌకర్యం కల్పించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వట్‌పల్లి(అందోల్): మండల కేంద్రంలో 108 అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని కోరుతూ బుధవారం వికలాంగుల సంఘం నాయకులు డిప్యూటీ తహసీల్దారు శంభిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వట్‌పల్లి నూతన మండలంగా ఏర్పాటై 7ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకూ అంబులెన్స్ సౌకర్యం కల్పించలేదన్నారు. దీంతో అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి వెళ్లేందుకు మండల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వికలాంగుల సంఘం డివిజన్ అధ్యక్షుడు సుభాష్, శ్రీనివాస్‌గౌడ్, ఖలీల్, నర్సింలు, ధన్‌సింగ్, రషీద్‌మియా, శ్రీను, ఖదీర్ పాల్గొన్నారు.

ఒరిగిన స్తంభాలు.. వేలాడుతున్న తీగలు

ఒరిగిన విద్యుత్ స్తంభాలతో పాటు చేతికందే స్థాయిలో వేలాడుతున్న కరెంట్ తీగలతో ప్రమాదం పొంచి ఉంది. అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ కరవై ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఇళ్లు, పంట పొలాల మధ్యన ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు మన్నిక దెబ్బతిని పూర్తిగా ఒరిగిపోయి ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. విద్యుత్ స్తంభాలు, వైర్లను సరిచేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునేనాథుడు కరువయ్యాడని వారు వాపోతున్నారు.

– ఝరాసంగం (జహీరాబాద్)

- ఇళ్ల మధ్య ప్రమాదకరంగా వేలాడుతున్న కరెంట్ వైర్లు
- భయాందోళనలో స్థానిక ప్రజలు
- చోద్యం చూస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

మండల కేంద్రంతో పాటు పరిధిలోని మాచ్నూర్, కుప్పానగర్, బిడేకన్నె, పొట్టిపల్లి, కప్పాడ్, బోరేగావ్, తదితర గ్రామాల్లో ఇళ్లు, రైతుల పంట పొలాల మధ్యన, ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలు ఒరిగిపోవడంతో పాటు చేతికందే ఎత్తులో చెట్ల కొమ్మలకు ఆనుకొని విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. పంటలు సాగు చేసే క్రమంలో విద్యుత్ స్తంభాలు, కరెంట్ తీగల భయం వెంటాడుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

ప్రమాదకరంగా పంట పొలాల మధ్యన ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలతో పాటు ఇళ్ల మధ్యన వేలాడుతున్న తీగలను వెంటనే సరిచేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోతోందని, చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విద్యుత్‌శాఖ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఒరిగిపోయిన స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్తగా స్తంభాలను ఏర్పాటు చేయాలని, అదేవిధంగా ఇళ్ల మధ్యన ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని ఆయా గ్రామాల రైతులు, ప్రజలు కోరుతున్నారు.



పంట పొలాల మధ్యన ఒరిగిన విద్యుత్ స్తంభాలు



బోరేగావ్ శివారులో రహదారి పక్కన ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు



విద్యుత్ తీగలు వేలాడకుండా ఏర్పాటు చేసిన కర్ర

కర్రలే విద్యుత్ స్తంభాలుగా...

పంట పొలాల మధ్యన విద్యుత్ స్తంభాలు ఒరిగిపోవడంతో రైతులు చేసేదేమీలేక కర్రల సహాయంతో విద్యుత్ వైర్లను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఏ సమయంలో ఎటువంటి ప్రమాదం సంభవిస్తుందోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు విద్యుత్ వైర్లు తెగిపోయి ప్రమాదాలు చోటుచేసుకున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

పర్మిషన్ ఉన్నవారికే మైనింగ్ అనుమతి

తహసీల్దార్ తెన్‌మొళి, ఎస్‌ఐ సురేష్



మాట్లాడుతున్న తహసీల్దార్ తెన్‌మొళి

మునిపల్లి(అందోల్): మైనింగ్ పర్మిషన్ ఉన్న వారికే ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుందని తహసీల్దార్ తెన్‌మొళి, బుదేరా ఎస్‌ఐ సురేష్ అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బుదేరా 30/1, కంకోల్ 52/పెద్దగోపులారం 30/1 సర్వేనంబర్‌లో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకే మైనింగ్‌కు ముగ్గురికి మాత్రమే అనుమతి ఉందని తెలిపారు. సంగారెడ్డి జిల్లా మైనింగ్ ఇన్‌చార్జి అసిస్టెంట్ డైరెక్టర్ రఘుబాబుకు మైనింగ్‌కు సంబంధించి మండలంలోని బుదేరా, కంకోల్, గోపులారం గ్రామాలను పర్యటించారని గుర్తు చేశారు. మూడు కంపెనీలకే మైనింగ్ పర్మిషన్ ఉందన్నారు. తాటిపల్లి, పిల్లోడి, మన్‌సాన్‌పల్లి, బోడపల్లి గ్రామాల శివారు డబ్బ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రవీందర్‌రావు, ఉప తహసీల్దార్ కృపాదానం, చందు, జ్యోతి, శశాంక్ పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించండి



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌ఎం ప్రభులత

నారాయణఖేడ్: ప్రయాణికులకు మెరుగైన రవాణా సేవలు అందించాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ప్రభులత అన్నారు. నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోను బుధవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సూపర్‌వైజర్లతో ఆమె మాట్లాడుతూ ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా మెరుగైన రవాణా సేవలను అందించేందుకు కృషి చేయాలన్నారు. గురుపౌర్ణమిను పురస్కరించుకుని అరుణాచలానికి ప్రత్యేక బస్సుల సౌకర్యం కల్పించినందునా భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిసూచించారు.డిపో మేనేజర్ మల్లేశయ్య, అసిస్టెంట్ మేనేజర్ నర్సింహులు, అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ దశరథరావు, ఎస్టీఐ నందులాల్, సూపరింటెండెంట్ ప్రవీణ్, పీఆర్వో పాండు పాల్గొన్నారు.

డబ్బులు వాపస్ ఇవ్వాలి

మునిపల్లి(అందోల్): రెండో విడత గొర్రెల మంజూరు కోసం చెల్లించిన డబ్బులను తిరిగి వాపస్ ఇవ్వాలని గొర్రె కాపరుల సంఘం సభ్యులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. బుధవారం మండలంలోని తాటిపల్లి, మునిపల్లి, పెద్దచల్మెడ, కంకోల్ పశువైద్య కేంద్రాల్లోని సబ్ సెంటర్లలో గొర్రె కాపరుల సంఘం సభ్యులు చెల్లించిన డబ్బులను వాపస్ ఇవ్వాలని దరఖాస్తు ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో గొర్రెల మంజూరు కోసం మండలంలోని ఆయా గ్రామాల గొర్రెకాపరులు 210 యూనిట్లు ఒక్కో యూనిట్‌కు రూ.43.750 చొప్పున డీడీలు చెల్లించి బ్యాంకులో జమ చేశారని మండల పశువైద్యాధికారి సంతోష్ తెలిపారు. రెండు సెట్లు జిరాక్స్ కాపీల చొప్పున డీడీలు, ఆధార్ కార్డు, దరఖాస్తు ఫారాలు ఇచ్చిన వారికే డబ్బులు తిరిగి చెల్లిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పెద్దలోడి శ్యాముల్, పండరి, నర్సింలు, సంగయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణా తరగతులు

న్యాల్‌కల్(జహీరాబాద్): శిక్షణా తరగతుల్లో నేర్చుకున్న అన్ని అంశాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేయాలని శిక్షకులు అనిత, అంజమ్మ, రాధమ్మ, గిరిజా గ్రేసీ అన్నారు. 3 నుంచి 6 ఏళ్లలోపు చిన్నారులకు పాఠాలు బోధించే విధానంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు న్యాల్‌కల్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా తరగతులను బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారుల మనోభావాలకు అనుగుణంగా పాఠాలు బోధించడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయని వివరించారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాల్సిందే

సీఐటీయూ నాయకుల డిమాండ్



జహీరాబాద్ టౌన్: తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా బుధవారం డిమాండ్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయాలు, ప్రధాన చౌరస్తాల్లో ధర్నాలు చేపట్టారు. పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్స్‌గా వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బొగ్గు బ్లాకుల వేలాన్ని నిలిపివేయాలన్నారు. ఆశావర్కర్లు, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం, ఐకేపీ వీఓఏ తదితర స్కీంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలను అందజేయాలని డిమాండ్ చేశారు.



నారాయణఖేడ్: నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు, నాయకులు



పటాన్‌చెరు టౌన్: కిర్బీ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు, నాయకులు



కల్హేర్: సిర్గాపూర్‌లో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు



మునిపల్లి: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



హత్నూర: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు



రాయికోడ్: వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

హత్నూర(సంగారెడ్డి): మండలం గోవిందరాజ్‌పల్లి గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రాజురెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ కలిసి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం మదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ తీసుకువెళ్లాలని సూచించారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుజాత, శివరాజ్, శ్రీశైలం పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ వీధికుక్క దాడిలో చిన్నారికి గాయాలు

సంగారెడ్డి టౌన్: చిన్నారులపై వీధికుక్కలు దాడులు చేస్తున్న సంఘటనలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. రెండు రోజుల క్రితం పట్టణంలోని 12వ వార్డులో ఆరేళ్ల బాలుడిపై వీధికుక్కలు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన మరువకముందే బుధవారం శాంతినగర్‌లో మరో సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారి షాజబ్ పాషాపై వీధికుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. దీంతో చిన్నారి కేకలు విన్న కాలనీవాసులు వీధికుక్కలను రాళ్లతో కొట్టి తరిమేసి చిన్నారిని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పట్టణంలో చిన్నారులపై కుక్కల దాడుల వరుస సంఘటనలు జరుగుతున్నా అధికారులు నిర్లక్ష్యం వహించడం పట్ల ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. పట్టణంలో వీధికుక్కల దాడులను స్థానిక ప్రజలు అరికట్టాలని కోరుతున్నారు.

◆ బీమా చెక్కు అందజేత

జహీరాబాద్ టౌన్: ఝరాసంగం మండల పరిధిలోని చిలపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారుడికి ఎస్‌బీఐ బ్యాంక్ చీఫ్ మేనేజర్ నిఖిత పాటిల్ రూ.2లక్షల బీమా చెక్కును బుధవారం అందజేశారు. గ్రామానికి చెందిన మైనోద్దీన్ ఎస్‌బీఐ జహీరాబాద్ బ్రాంచ్‌లో ప్రమాద బీమా చేయించుకోవడంతో నామినీ అయిన హుసేన్‌కు చెక్కు అందజేశారు. బ్యాంక్ అధికారులు శ్రీనివాస్, జగదీష్, శివకృష్ణ, సందీప్, షేక్ ముక్తర్, షిండే పాల్గొన్నారు.

◆ వేతనాలు చెల్లించాలని కార్మికుల ఆందోళన

హత్నూర(సంగారెడ్డి): తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యాక్రమంలో ఆయా గ్రామాల పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

◆ కార్మికుడి కుటుంబానికి చెక్కు పంపిణీ

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని ఎస్బీ ఆర్గానిక్స్ కంపెనీలో రెండు నెలల కిందట ప్రమాదంలో మరణించిన వడ్డేపల్లి వీరేశం కుటుంబ సభ్యులకు నష్టపరిహారం కింద రూ.41లక్షల చెక్కును కంపెనీ ప్రతినిధులతో కలిసి మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుజాత, నాయకులు కృష్ణ, సత్యం పాల్గొన్నారు.

◆ శిఖం భూములు కబ్జా చేస్తే చర్యలు

హత్నూర(సంగారెడ్డి): శిఖం భూములు కబ్జా చేస్తే చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ పర్వీన్ షేక్ అన్నారు. హత్నూర గ్రామంలోని పెద్ద చెరువు అల్వాయి చెరువు తాలింపు శిఖం భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ త్వరలోనే అన్ని చెరువుల శిఖం భూములను సర్వే చేయిస్తామని పేర్కొన్నారు. ఆమె వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

◆ పౌష్టికాహారం తీసుకోవాలి

మునిపల్లి(అందోల్): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ మనుజారెడ్డి అన్నారు. బుధవారం ఆరోగ్య కేంద్రంలో పలువురిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

◆ జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఝరాసంగం(జహీరాబాద్): మండల పరిధిలోని వివిధ గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో వేరువేరుగా వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే అందించాలని కోరారు. జీవో 51 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీల కార్మికులు పాల్గొన్నారు.

◆ కేతకీలో వాహనాల పార్కింగ్ వేలం పూర్తి

ఝరాసంగం(జహీరాబాద్): కేతకీ సంగమేశ్వర ఆలయం వాహనాల పార్కింగ్ టెండర్ ప్రక్రియ ముగిసింది. బుధవారం ఆలయ ఆవరణలో ఆలయ అధికారులు గ్రామస్తుల ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 8 మంది రూ. 50,000 ధరావతు చెల్లించి వేలం పాటలో పాల్గొన్నారు. ఝరాసంగం గ్రామానికి చెందిన గోపాల్ రూ.2లక్షల 65వేలకు అత్యధికంగా పోటీపడి దక్కించుకున్నారు. సంవత్సర కాలం పాటు వాహనాల పార్కింగ్ ఉంటుందని ఆలయ అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శశిధర్, అర్చకులు దిలీప్ మహారాజ్, బసయ్య స్వామి, అధికారులు శివకుమార్, ఈరన్న, రమేష్ పాల్గొన్నారు.

◆ రుణమాఫీని అమలు చేయాలి

పుల్‌కల్(అందోల్): రైతులకు రెండు లక్షల రుణమాఫీని ఆంక్షలు లేకుండా మాఫీ చేయాలని బీజేపీ నాయకులు తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రంలో కోరారు.

◆ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలల బలపేతానికి కృషి చేస్తున్నామని డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పోచారం ప్రభుత్వ పాఠశాలలో పార్కర్ హానిఫిన్ ఇండియా సహకారంతో మెడ్విన్ స్వచ్ఛంద సంస్థ విద్యార్థులకు క్రీడా పరికరాలు, ఎడ్యుకేషన్ కిట్స్ అందజేశారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ మెంబర్ వెంకటేశం, పార్కహాని సిబ్బంది, పాఠశాల హెచ్‌ఎం ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

నారాయణఖేడ్: హైదరాబాద్‌లోని రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన గురునాథ్‌రెడ్డి బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, ఉమ్మడి మెదక్ జెడ్పీ ప్రణాళిక సంఘ మాజీ సభ్యులు నగేష్‌షెట్కార్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

◆ జోనల్ కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): శేరిలింగంపల్లిలోని జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిను బుధవారం కార్పొరేటర్ పుష్ప మర్యాదపూర్వకంగా కలసి డివిజన్ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని నెలకొన్న సమస్యల పరిష్కారానికి హామీనిచ్చినట్లు తెలిపారు.

◆ ఉద్యమకారుల అభివృద్ధి సంఘం ఇన్‌చార్జిగా నరేందర్

నారాయణఖేడ్: తెలంగాణ ఉద్యమకారుల అభివృద్ధి సంఘం ఖేడ్ డివిజన్ ఇన్‌చార్జిగా ఖేడ్ పట్టణానికి చెందిన నరేందర్ ఎన్నికయ్యారు. అంబేడ్కర్ భవన్‌లో సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోర్గి సంజీవులు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సభ్యులు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకొని ధృవపత్రాన్ని అందజేశారు. అనంతరం సంఘ బాధ్యులు, తెలంగాణ జేఏసీ ఖేడ్ డివిజన్ చైర్మన్ ముధ నారాయణ, ప్రధాన కార్యదర్శి ఖాజా, సలహాదారు గాలయ్య, కల్లు గీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అంజాగౌడ్, సీపీఐ నాయకులు చిరంజీవి, నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు బాలాజీ తదితరులు ఘనంగా సన్మానించారు.

◆ మొక్కలను సంరక్షించాలి

రాయికోడ్(అందోల్): ప్రతిఒక్కరూ మొక్కలను సంరక్షించాలని మండల ప్రత్యేకాధికారి జగదీశ్వర్ అన్నారు. రాయికోడ్‌లోని బీసీ వసతి గృహం ఆవరణలో వార్డన్ శారద, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మొక్కల పెంపకంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ పాల్గొన్నారు.

◆ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



రామచంద్రాపురం(పటాన్‌చెరు): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరు కృషి చేయాలని భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ వెన్నవరం సింధురెడ్డి అన్నారు. బుధవారం ఎల్‌ఐజీ కాలనీలోని పార్కు ఆవరణలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. స్థానిక నేతలు, కాలనీవాసులు పాల్గొన్నారు.